నేటి నుంచి 4 రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తేతెలంగాణ) : నైరుతి బంగాళాఖాతం మీదుగా ఉత్తరాంధ్ర నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు ద్రోణి విస్తరించి ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. దీని ప్రభావంతో మంగళవారం నుంచి మూడు రోజులపాటు రాయలసీమ, దక్షిణకోస్తా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

రైతులను ఇబ్బంది పెట్టే వ్యాపారులపై ఎస్మా: సీఎం

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందిపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు తన దృష్టికి రావడంతో సీఎం స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతులను ఇబ్బందిపెట్టే వ్యాపారులపై అవసరమైతే ఎస్సెన్షియల్ సర్వీసెస్ మెయింటెనెన్స్ యాక్ట్(ఎస్మా) కింద చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో మోసాలకు పాల్పడటం, రైతులను గందరగోళానికి గురి చేయడం, రైతులను వేధించటం లాంటి సంఘటనలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్‌పాస్‌కు 10శాతం రాయితీ

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తేతెలంగాణ): మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్‌పాస్ కలిగిన ప్రయాణికులు లహరి, రాజధాని, గరుడ ప్లస్, ఈ-గరుడ తదితర ఏసీ సర్వీసుల్లో 10శాతం రాయితీని పొందొచ్చని ఆర్టీసీ తెలిపింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే అన్ని టీజీఎస్ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ఈ డిస్కౌంట్ వర్తించనుందని పేర్కొంది. మెట్రో ఎక్స్‌ప్రెస్‌తోపాటు మెట్రో డీలక్స్, గ్రీన్ మెట్రో, ఎయిర్ పోర్ట్ పుష్పక్ బస్‌పాస్ కలిగిన ప్రయాణికులు ఈ రాయితీని పొందే అవకాశం ఉంటుంది. జనవరి 31 వరకు 10 శాతం రాయితీ అమల్లో ఉండనుంది.

ప్రైమరీ టీచర్లుగా అవకాశమివ్వాలి

డీపీఎస్‌ఈ అభ్యర్థుల వినతి

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్ నియామకాల్లో డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్‌ఈ) కోర్సు పూర్తిచేసిన వారికి అవకాశం కల్పించాలని కోరుతూ అభ్యర్థులు విద్యాశాఖ అధికారులను కోరారు. రాష్ట్రంలో ఎన్ఈపీని అమలుచేసి, నర్సరీ నుంచి రెండో తరగతి వరకు విద్యాబోధన బాధ్యతలను ప్రీ స్కూల్ టీచర్లకు అప్పగించాలని డీపీఎస్‌ఈ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు మేఘన, ప్రధాన కార్యదర్శి సురేశ్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ సోమవారం ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

సోషల్ వెల్ఫేర్‌లో జోనల్ క్రీడాపోటీలు

హైదరాబాద్, నవంబర్11(నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలసంస్థలో 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. సొసైటీ సెక్రటరీ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 వేదికల్లో 14వ తేదీ వరకు క్రీడా పోటీలు కొనసాగనున్నాయని వెల్లడించారు.

బీ- క్యాటగిరీ సీట్లు ఆన్‌లైన్‌లో భర్తీ ?

- సర్కారుకు ఉన్నత విద్యామండలి లేఖ
- నీట్ తరహాలో భర్తీ చేయాలంటూ సూచనలు

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): బీటెక్ మేనేజ్‌మెంట్, ఎన్నార్లై కోటా సీట్ల భర్తీలో జరుగుతున్న అక్రమాలకు వచ్చే ఏడాదైనా అడ్డుకట్టపడుతుందా..? అంటే తెలంగాణ ఉన్నత విద్యామండలి వర్గాలు అవుననే అంటున్నాయి. దీనిపై తాము దృష్టిసారించామని, బీ క్యాటగిరీ సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీచేసేందుకు ప్రయత్నిస్తున్నామని మండలి వర్గాలంటున్నాయి. ఇందుకు అనుమతి కోరుతూ ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి లేఖ కూడా రాసింది. సర్కారు పట్టించుకోకపోవడం, విద్యాశాఖ దృష్టి సారించకపోవడంతో ఈ ఏడాది కాలేజీలు ఆడింది ఆట.. పాడింది పాటగా సాగింది. నీట్ తరహాలో బీటెక్‌లోనూ యాజమాన్య కోటా సీట్ల భర్తీచేస్తే బాగుంటుందన్న సూచనలు విద్యార్థి సంఘాల నుంచి వస్తున్నాయి. దీంతో ఆ సీట్లను ఆన్‌లైన్‌లోనే భర్తీచేయనున్నారు. దీనికి కొన్ని ప్రైవేట్ కాలేజీలు అంగీకరించినట్టు తెలిసింది. కోర్టు కేసులు తలెత్తకుండా నోటిఫికేషన్ సమయంలోనే నిబంధనలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు.

అన్నదమ్ముల కోల్డ్‌వార్!

- మంత్రి పదవిని ఎరగా వేసి గ్యాప్ పెంచిన ముఖ్యనేత
- ఆర్నెళ్లుగా పలకరించుకోని బ్రదర్స్
- కాంగ్రెస్‌లో హాట్‌టాపిక్‌గా వైరం



హైదరాబాద్, నవంబర్11(నమస్తే తెలంగాణ): నిన్న, మొన్నటి వరకు ఒకేమాట, ఒకే బాటగా నడిచిన ఆ అన్నదమ్ముల మధ్య కోల్డ్ వార్ నడుస్తున్నదా? వారిద్దరి మధ్య దూరం పెరిగిందా? ఆరు నెలలుగావారిద్ద మధ్య మాటలు లేవా? ఒకరినొకరు పలరించుకోవడం లేదా? సొంత నియోజకవర్గంలో సీఎం పాదయాత్ర చేస్తుంటే, అమెరికా పర్యటన పేరుతో ఒక సోదరుడు కావాలనే దూరంగా ఉన్నారా? ఇటీవలి పరిణామాలు, అన్నదమ్ముల ప్రవర్తన తీరు చూస్తుంటే పరిస్థితి అలాగే ఉన్నదంటున్నారు కాంగ్రెస్ కార్యకర్తలు. మంత్రి పదవి మీద మమకారం ఆ అన్నదమ్ముల మధ్య దూరం పెంచుతున్నదనే టాక్ వినిపిస్తున్నది. ముఖ్య నాయకుడు అటు అన్నను ఎగేసి, ఇటు తమ్ముణ్ని సగేసి రాజకీయం సాగిస్తున్నారని కార్యకర్తలు అనుకుంటున్నారు. నిజానికి, అన్నదమ్ముల మధ్య కొన్నాళ్లుగా తీవ్రమైన రాజకీయ వైరం కొనసాగుతూ వచ్చింది. అన్నతో విభేదించిన తమ్ముడు గతంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. సాధారణ ఎన్నికల నాటికి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. ఇద్దరూ గెలిచారు. దీంతో ఇద్దరి మధ్య మంత్రి పదవి పేచీ వచ్చిందని పార్టీ కార్యకర్తలు చెప్తున్నారు. ఇద్దరి కిద్దరు తగ్గేదే లేదు అన్నట్టు ఎవరి లాబీయింగ్ వారు నడిపించారు. అప్పటికే కాంగ్రెస్‌లో సీనియర్ నేతగా.. కష్టాల్లో పార్టీని అంటిపెట్టుకొని ఉన్న నమ్మకస్తుడిగా ఉన్న అన్నను మంత్రి పదవి వరించింది.

మంత్రి పదవిపై తమ్ముడి ఆశలు!

అయితే, పార్టీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి ఇస్తారన్న హామీతోనే తమ్ముడి తిరిగి కాంగ్రెస్‌లో చేరారని ఆయన అనుచరులు చెప్తున్నారు. దీంతో మొదటి విస్తరణలోనే తనకు మంత్రి పదవి వస్తుందని తమ్ముడు ఆశలు పెట్టుకున్నారట. ఆయనే స్వయంగా చాలా సందర్భాల్లో పలు వేదికల మీద బహిరంగంగానే తనకు మంత్రి పదవి వస్తుందని ప్రకటించుకున్నారు. హోం శాఖ మంత్రిగా చేయాలని ఉన్నదంటూ మనసులో కోరికను వెలిబుచ్చారు. కాని సొంత సోదరుని రూపంగా ఎదరు తన్నడంతో ఆయన మంత్రి పదవి దక్కలేదు. ఈ లోపే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా తన వాళ్లను నిలుపుకోవడానికి ఎవరి ప్రయత్నం వాళ్లు చేశారని పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఒకరు తన మరో సోదరుని కుమారునికి టికెట్ ఇప్పించడానికి ప్రయత్నించగా, మరొకరు తన భార్య కోసం టికెట్ అడిగారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ ఇద్దరికీ కాకుండా ముఖ్యనేత తనకు అత్యంత నమ్మకస్తుడైన వ్యక్తికి టికెట్ ఇచ్చారని, ముఖ్యనేత తన జకీయ చతురత చూపారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మంత్రి పదవిలో ఉన్న అన్నను పిలుపించుకొని, ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవికి ఢోకా ఉండదని చెప్పారట. మరోవైపు తమ్ముణ్ని పిలిచి ఎంపీ అభ్యర్థి గెలుపు మీ భుజాల మీద పెడుతున్నా..ఆయన్ను గెలిపించుకొని వస్తే మీకు మంత్రి పదవి దక్కుతుందనే ఆశ కల్పించారని వారి అనుచరులు చెప్తున్నారు. దీంతో మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న తమ్ముడు, మంత్రి పదవిని కాపాడుకోవడానికి అన్న ఎవరికి వారు కష్టపడి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించారట.

అన్న త్యాగం చేస్తేనే తమ్ముడికి చాన్స్!

మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే ప్రచారం నేపథ్యంలో తమ్ముడు ముఖ్యనేత వద్దకు వెళ్లి మంత్రి పదవి తనకు ఇవ్వాలని అడిగారట. అన్న అప్పటికే మంత్రిగా ఉన్నందున అదే ఇంట్లో మరో మంత్రి పదవి సాధ్యం కాదని, ఇది ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కు విరుద్ధమని, అన్న పదవీత్యాగం చేస్తే, తమ్ముడికి నిరభ్యంతరంగా ఇవ్వవచ్చని అధిష్ఠానం చెప్పిందని ఆ ముఖ్యనేత బదులిచ్చారట. దీంతో తమ్ముడు ఆ దిశగా కూడా ప్రయత్నాలు చేసినట్టు తెలిసింది. ఇప్పటికే రెండు పర్యాయాలు మంత్రిగా చేశారు కాబట్టి, తన కోసం పదవీత్యాగం చేయాలని, హోంశాఖ మంత్రిగా చేయాలనే తన కల నెరవేరుతుందని చెప్పి రాయబారుల ద్వారా ఒప్పించే ప్రయత్నం చేశారట. ఇందుకు అన్న ఒప్పుకోలేదని, నీ మంత్రి పదవి నువ్వే తెచ్చుకో.. నేను మాత్రం ఉన్న పదవిని వదిలేది లేదని తెగేసి చెప్పినట్టు తెలిసింది. దీంతో ఇద్దరు సోదరుల మధ్య దూరం పెరుగుతూ వచ్చిందని, గత ఆరు నెలల నుంచి పలకరింపులు కూడా లేవని కార్యకర్తలు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే మూసీ పునర్జీవ పాదయాత్ర పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు ఒక సోదరుడు మాత్రం ఈ యాత్రకు హాజరు కాలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అన్న మీద కోపంతోనే ఆయన పాదయాత్రకు దూరంగా ఉన్నారని, మరోవైపు మరో కీలక నేతకు సన్నిహితంగా మెలగడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

ఇక్కడ పాలన పాతర.. అక్కడ ప్రచార జాతర

- మహారాష్ట్ర, జార్ఖండ్, కేరళకు తెలంగాణ మంత్రులు
- ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రచారం
- రేవంత్, ఉత్తమ్, భట్టి, సీతక్క పలుమార్లు ఇతర రాష్ట్రాలకు
- విదేశీ పర్యటనలో మంత్రులు జూపల్లి, శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): 'పని పాతర పెట్టి ఊరు జాతర పోయిందనే' సామెత చందంగా రాష్ట్రంలో పాలనకు పాతరేసిన తెలంగాణ మంత్రులు.. ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో మునిగి తేలుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క తదితరులు మహారాష్ట్ర, ఝార్ఖండ్, కేరళ రాష్ట్రాలకు క్యూ కడుతున్నారు. అక్కడి ఎన్నికల్లో జోరుగా ప్రచారం చేస్తున్నారు. మరో ఇద్దరు మంత్రులు విదేశీ పర్యటనల్లో బిజీగా ఉన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు లండన్, స్కాట్లాండ్ పర్యటనలో ఉండగా, మరో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మలేషియా పర్యటనలో ఉన్నారు. ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో, విదేశీ పర్యటనల్లో తలమునకలైన మంత్రులు సొంత రాష్ట్రంలో ధాన్యం, పత్తి కొనుగోళ్లు లేక రైతులు పడుతున్న గోసను మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

చలో మహారాష్ట్ర, జార్ఖండ్, కేరళ

త్వరలో మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కేరళలోని వయనాడ్ ఎంపీ స్థానానికి రాహుల్‌గాంధీ రాజీనామాతో ఉప ఎన్నికలొచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంకగాంధీ పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు అత్యంత ప్రతిష్ఠాత్మకమైనవి కావడంతో విజయం కోసం నానా తంటాలు పడుతున్నారు.

ఇక్కడ రైతుల గోస.. అక్కడ మంత్రుల గొప్పలు

రాష్ట్రంలో ధాన్యం, పత్తి కోతలు మొదలై నెలగడుస్తున్నా, వాటిని కొనుగోలు చేసే దిక్కులేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల పేరుతో తిరస్కరిస్తుంటే దిక్కులేక ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. రైతులు ఇక్కడ నానా గోస పడుతుంటే, తెలంగాణ మంత్రులు మాత్రం ఇతర రాష్ట్రాల్లో గొప్పలు చెప్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డినే ఈ విధంగా ప్రచారం చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

14 నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

- ఎల్బీ స్టేడియంలో విద్యార్థులతో సీఎం సమావేశం
- ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవాలను ఈ నెల 14న ప్రారంభించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14న 14 వేల మంది విద్యార్థులతో విద్యాదినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. సోమవారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

- అటునుంచే రేపు ముంబైకి
- 11 నెలల్లో హస్తినకు 25వ సారి

హైదరాబాద్, నవంబర్11 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ బాట పట్టనున్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ఢిల్లీకి వెళ్తారు. ఒక ఆంగ్ల ప్రతిక నిర్వహించనున్న కాంక్లేవ్‌లో రేవంత్‌రెడ్డి పాల్గొంటారని సీఎంవో వర్గాలు తెలిపాయి. కాంక్లేవ్ అనంతరం పార్టీ అధిష్ఠాన పెద్దలను కలిసి తన ఏడాది పాలనా ఉత్సవాలకు ఆహ్వానించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వ్యవహారాలూ చర్చించనున్నట్టు తెలిసింది. తిరిగి మంగళవారం రాత్రి లేదా బుధవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకుంటారని, తిరిగి అదే రోజు 13న రేవంత్‌రెడ్డి ముంబై వెళ్లి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి ఇప్పటి వరకు ఢిల్లీకి వెళ్లడం ఇది 25వ సారి.

ప్రజల సొమ్ముతో కాంగ్రెస్ 'మహా' సోకులు

- రుణమాఫీ పూర్తయిందంట
- మరాఠీ పత్రికలకు రేవంత్‌రెడ్డి పంచరంగుల ప్రకటనలు

మరాఠ పత్రిక మొదటి పేజీలో వచ్చిన యాడ్

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ఒకవైపు రాష్ట్రంలో రుణమాఫీ కాక రైతులు రోడ్డు మీదికొచ్చి ఆందోళనలు చేస్తుండగా.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం తెలంగాణలో రైతుల రుణాలు మొత్తం మాఫీ చేశామని చెప్తూ మరాఠీ పత్రికలకు ప్రకటనలు గుప్పిస్తున్నారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యం లో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా కోట్ల రూపాయల తెలంగాణ ప్రజల డబ్బును ఖర్చు చేస్తున్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రకటనల కోసం తెలంగాణ ప్రభుత్వం దాదాపు రూ.15 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిసింది. ఆరు మరాఠీ పత్రికలకు, మూ డు ఇంగ్లిష్ పత్రికలకు ప్రకటనలు ఇచ్చినట్టు సమాచారం. యాడ్‌లో ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమం త్రి, సమాచార శాఖ మంత్రి ఫొటోలు వేశా రు. వారితో పాటు చిన్న సైజులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే ఫొటోలు కూడా వేశారు. ఎలక్షన్ కమిషన్ కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఈ ప్రకటనలను ఐఅండ్ పీఆర్ నుంచి కాకుండా ప్రైవేటు యాడ్స్‌గా కలరింగ్ ఇస్తున్నట్టు సమాచారం. ఒక ఏజెన్సీతో ఒప్పందం చేసుకొని, దాని పేరు మీద ప్రతికలకు వర్క్ ఆర్డర్ ఇస్తున్నట్టు తెలిసింది. తెలంగాణలో 13 పథకాలు అమలు చేసినట్టు ఆ ప్రకటనల్లో పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద పథకం 22 లక్షల మందికి రూ.18 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేసినట్టు ఓ ప్రకటన పేర్కొంది. పొదుపు మహిళా సంఘాలకు లక్ష కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చినట్టు, 50 వేల ఉద్యోగాలు, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిచ్చినట్టు పంచరంగుల చిత్రాలతో మొదటి పేజీ యాడ్స్ ఇచ్చారు.

మత రాజకీయాలతో దేశానికి నష్టం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): హిందు, ముస్లింల మధ్య విభజన రాజకీయాలు దేశానికి నష్టం చేకూరుస్తాయని, దేశాన్ని మరింత బలహీనపరుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన జాతీయ విద్యాదినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో హిందువులు, ముస్లింలను తమ ప్రభుత్వం రెండు కండ్లలా భావిస్తున్నదని చెప్పారు. దేశంలో ఆధునిక విద్యకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ బలమైన పునాది వేశారని, నెహ్రూ నాయకత్వంలో 11 ఏండ్లపాటు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా దేశానికి అత్యుత్తమ విద్యావిధానాన్ని అందించారని గుర్తుచేశారు. మైనార్టీ గురుకులాలు రూపొందించిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అబుల్‌కలాం ఆజాద్, ముఖ్దూమ్, లైఫ్ టైమ్ అవార్డులను పలువురికి సీఎం అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో మరో విద్యార్థిని సూసైడ్

11 నెలల్లో నలుగురు విద్యార్థుల బలవన్మరణం

స్వాతిప్రియ (ఫైల్)

బాసర/ఆర్మూర్‌టౌన్, నవంబర్ 11: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ రెండో సంవత్సరం చదువుతున్న స్వాతిప్రియ (18) సోమవారం హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన రవీందర్-ఉజ్వల దంపతుల కూతురు స్వాతిప్రియ ట్రిపుల్ ఐటీలో పీయూసీ రెండో సంవత్సరం చదువుతున్నది. తోటి విద్యార్థులు టిఫిన్ చేయడానికి డైనింగ్ హాల్‌కు వెళ్లగా హాస్టల్ గదిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. టిఫిన్ చేసి రూంకు వచ్చిన విద్యార్థినులకు స్వాతిప్రియ ఉరేసుకుని కపించింది. దీంతో వారు సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అధికారులు సీఐ రాకేశ్, బాసర ఎస్సై గణేశ్‌లకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకి దించి అంబులెన్సులో భైంసా ఏరియా దవాఖానకు తరలించారు. స్వాతిప్రియ ఫోన్, అక్కడ లభ్యమైన సూసైడ్ లెటర్‌ను స్వాధీనం చేసుకుని స్వాతిప్రియ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కాగా.. యూనివర్సిటీకి చేరుకోకముందే మృతదేహాన్ని తరలించడంతో ఆగ్రహం వ్యక్తంచేసిన తల్లిదండ్రులు.. 'మా బిడ్డను ట్రిపుల్ ఐటీ యాజమాన్యమే చంపేసింది' అని ఆరోపించారు. సీనియర్ విద్యార్థి తోపాటు మరో తోటి విద్యార్థిని కూడా తనను వేధిస్తున్నారని తమ కూతురు చెప్పిందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఏబీవీపీ కార్యకర్తలు గేటు దూకేందుకు ప్రయత్నించగా.. ఏబీవీపీ కార్యకర్తలు, ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీకి వాగ్వాదం జరిగింది. ఇందులో ఏబీవీపీ కార్యకర్తపై సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయగా తలపై తీవ్ర గాయం అయింది.

ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడిలో గాయపడ్డ ఏబీవీపీ కార్యకర్త

వెంటనే అతడిని భైంసాకు, అక్కడి నుంచి నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. భైంసా ఏఎస్సీ అవినాశ్‌కుమార్ ట్రిపుల్ ఐటీకి చేరుకుని ఏబీవీపీ కార్యకర్తలతో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 11 నెలల్లో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడటంపై ట్రిపుల్ ఐటీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కూతురు కడచూపునకు నోచుకోని తండ్రి

ఓ కేసులో జగ్దల్‌పూర్ జైలుకు తరలింపు • బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన ఎన్ఐఏ కోర్టు

సారంగాపూర్, నవంబర్ 11: ఓ కేసులో జైలుకు వెళ్లిన తండ్రి.. కన్నకూతురు అంత్యక్రియలకు కూడా నోచుకోలేకపోయాడు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన పోగుల రాజేశం కూతురు పోగుల లత (23) అనుమానాస్పద స్థితిలో నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం రేవోజీపేటలో మృతి చెందింది. మృతురాలి తండ్రి రాజేశంను ఓ కేసులో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసులు అరెస్టు చేయగా.. ప్రస్తుతం జగ్దల్‌పూర్ జైలులో ఉన్నాడు. కూతురును కడసారి చూసేందుకు ఆమె మృతదేహాన్ని రేచపల్లిలోనే ఫ్రీజర్‌లో భద్రపర్చారు. జైలులో ఉన్న రాజేశం విడుదల కోసం మృతురాలి తల్లి మల్లీశ్వరి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధవకుమార స్వామి, తెలంగాణ జనజాగృతి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి సోమవారం జగ్దల్‌పూర్ కోర్టుకు వెళ్లి బెయిల్ పిటిషన్ వేశారు. కానీ.. అక్కడి ఎన్ఐఏ కోర్టు బెయిల్ మంజూరు చేయలేదు. దీంతో మంగళవారం లత అంత్యక్రియలు జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. లత మృతిపై పలు అనుమానాలు ఉండటంతో రీపోస్టుమార్టం చేసేందుకు వీలుగా ఆమె మృతదేహాన్ని ఖననం చేయనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

తండ్రిని చంపి పోలీస్‌స్టేషన్‌కు చేరిన కొడుకు

పోలీసుల అనుమతితో అంత్యక్రియలకు హాజరు

సుల్తానాబాద్, నవంబర్ 11: ఆస్తి తగాదాలో తండ్రిని చంపి పోలీస్‌స్టేషన్‌కు చేరిన కొడుకు.. సోమవారం పోలీసుల అనుమతితో తండ్రి అంత్యక్రియలకు హాజరయ్యాడు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని యాదవనగర్‌కు చెందిన తొట్ల మధునయ్య, కొడుకు తొట్ల తిరుపతి మధ్య ఆస్తి కోసం తలెత్తింది. ఈ ఘర్షణలో మధునయ్య మృతిచెందగా.. కొడుకు పోలీసుల అదుపులో విచారణలో ఉన్నాడు. తండ్రి అంత్యక్రియల కోసం పలువురు పెద్దల విజ్ఞప్తి మేరకు పోలీసులు మానవతా దృక్పథంతో కొడుకుకు అనుమతినిచ్చారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య తిరుపతిని అంత్యక్రియలు జరిగే ప్రదేశానికి తీసుకెళ్లి కార్యక్రమం జరిగిన వెంటనే తిరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తాగిన మైకంలో జరిగిన ఘటనను తలుచుకుని తిరుపతి తండ్రి కాళ్లపై పడి రోదించిన తీరు పలువురిని కలచివేసింది. విచారణ అనంతరం తిరుపతిని జిల్లా జైలుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు. అంత్యక్రియల సమయంలో సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

టీజీపీఎస్సీ సగం ఖాళీ

- డిసెంబర్ 2న చైర్మన్ పదవీ విరమణ
- ఆ తర్వాత ఇద్దరు సభ్యులు కూడా

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీచేసే టీజీపీఎస్సీ త్వరలోనే సగం ఖాళీకానుంది. కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి 62 ఏండ్లు పూర్తి చేసుకోనుండటంతో ఆ పదవి నుంచి రిటైర్మెంట్ పొందనున్నారు. ఆ తర్వాత మూడు, నాలుగు నెలల వ్యవధిలోనే కమిషన్ సభ్యురాలు అనితారాజేంద్ర, ఆ తర్వాత రామ్మోహన్‌రావు వరుసగా పదవీ విరమణ పొందనున్నారు. దీంతో టీజీపీఎస్సీ సగానికి పైగా ఖాళీకానుంది. ఏడాదిన్నర తర్వాత ప్రొఫెసర్ నర్రి యాదయ్య పదవీ విరమణ పొందుతారు. ఇప్పుడున్న సభ్యుల్లో కేవలం అమీరుల్లాఖాన్, పాల్వాయి రజినీకుమారి మాత్రమే ఎక్కువకాలం పదవిలో ఉండనున్నారు.

కొత్త చైర్మన్ కోసం దరఖాస్తుల స్